సన్నాలకు బోనస్ వచ్చేదెప్పుడో?

- మండలంలో 86 మంది రైతుల ఎదురుచూపు
- 7వేల క్వింటాళ్ల సన్న ధాన్యం సేకరణ
- ఇంకా విడుదల కాని బోనస్ డబ్బులు



గంభీరావుపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ (ఫైల్)

గంభీరావుపేట: ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో రైతులు సన్నరకం వరిసాగు చేసుకున్నారు. దళారులకు కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారు. విక్రయాలు పూర్తయి నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో మాత్రం బోనస్ డబ్బులు జమ కావడం లేదు. సన్నాల సాగు చేసుకునే రైతులు బోనస్ డబ్బులు ఆలస్యమవుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. బోనస్ డబ్బులు జమ కాకపోవడంతో రైతులు ఎదురుచూపులు తప్పడం లేదు.

గంభీరావుపేట మండల పరిధిలో 2లక్షల75 వేల క్వింటాళ్ల దొడ్డు, సన్నరకం ధాన్యం కొనుగోలు చేశారు. దాదాపు 86 మంది రైతుల నుంచి 7,109 క్వింటాళ్ల సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. యాసంగిలో వరి కోతలు పూర్తయి కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలు జరిపారు. ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రైతులు సన్నాల సాగును సైతం చేపట్టారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 23 కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరిగాయి. పలు రైసుమిల్లులకు తరలించారు. సాధారణ రకం వడ్లకు ఇచ్చిన ప్రకారం డబ్బులు రైతుల ఖాతాలో జమయ్యాయి. కానీ సన్నాలకు సంబంధించిన బోనస్ మాత్రం ఇంకా జమకాలేదు. బోనస్ డబ్బుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

బోనస్ కోసం ఎదురుచూస్తున్నాం



సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అందిస్తామన్న బోనస్ కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వ ప్రకటనతో సంతోషపడి కష్ట నష్టాలకోర్చి సన్నరకం ధాన్యం సాగు చేశాం. వెంటనే బోనస్ డబ్బులు జమచేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

– పెద్దవేని మల్లయ్య, రైతు, గంభీరావుపేట

బ్యాంక్‌లో జమచేయాలి



ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా రూ.500 చొప్పున ఇస్తామన్న బోనస్ మాత్రం ఇంకా రాలేదు. బోనస్ డబ్బుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం వెంటనే బోనస్ డబ్బులు బ్యాంకులో జమచేయాలి.

– కాట శ్రీనివాస్, రైతు, గంభీరావుపేట

క్లుప్తంగా

27న రాజన్న కోడెలు పంపిణీ

వేములవాడ: ఈనెల 27న తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలో కోడెలు పంపిణీ చేయనున్నట్లు ఆలయ ఈవో రాధాభాయి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. గోశాలలోని 200 కోడెలను ఆదివారం ఉదయం 8.30 గంటలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఆనుకుని ఉన్న రైతులు అర్హులని స్పష్టం చేశారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డులకు సంబంధిత ధ్రువపత్రాలతో వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ వైపే ప్రజలు



మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

బోయినపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని, బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చొప్పదండి బీఆర్ఎస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య అధ్యక్షతన మంగళవారం బోయినపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులే దొరకడం లేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నాడి అమిత్‌కుమార్, గుంటి శంకర్, ఎస్. మాధవ్, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, నిమ్మ శ్రీనివాసరెడ్డి, బోయిని రాజు, చిందం రమేశ్, డబ్బు సృజన్, ఎండీ.అజ్జూ, అంజన్‌రావు, నాగయ్య తదితరులు ఉన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న వికాస్‌రావు

వేములవాడ రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ వికాస్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం నందికమాన్ వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేములవాడ రూరల్ మండలం అధ్యక్షుడు పరమేశ్, అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి, బండ మల్లేశం, సుంకరి నరేందర్, తోట శేఖర్, వనపర్తి పర్శరాములు, మండల ఎన్నికల కన్వీనర్ శంకర్, రాజిరెడ్డి, లక్ష్మణ్ రాష్ట్ర, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

గంభీరావుపేట: మండలంలోని నర్మాలలో పీహెచ్‌సీ అధికారులు మంగళవారం క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి రావడానికి కారణాలు, లక్షణాలు, నియంత్రణ విధానం గురించి ప్రజలకు వివరించారు. 144 మందికి టీబీ స్క్రీనింగ్ చేసి 22 మంది అనుమానితుల నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ మహిపాల్, సీహెచ్‌వో రమేశ్, టీబీ నోడల్ అధికారి అమరావతి, అధికారులు సీతా మహాలక్ష్మీ, ఏఎన్ఎం రాజేశ్వరి, విజయ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై..

మండలంలోని దమ్మన్నపేట మోడల్ స్కూల్‌లో ప్రముఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. సామాజిక భావోద్వేగ పరిస్థితులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకంబరీగా అమ్మవారు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ఆషాఢమాసం చివరి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను కూరగాయలతో అలంకరించి, మొక్కులు చెల్లించుకున్నారు. సుహాసినులు అర్చనలు, కుంకుమార్చనలు, లలితాపారాయణం నిర్వహించారు. మండలకేంద్రంలోని దుర్గామాత ఆలయంలో అమ్మవారు శాకంబరీ రూపంలో దర్శనమిచ్చారు. రాచర్ల గొల్లపల్లిలోని నాగుల ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి శాకంబరీ మహోత్సవ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు సంపత్‌శర్మ, దయానంద్‌శర్మ, విద్యాసాగర్‌శర్మ, రఘురామశర్మ, గుండయ్యశర్మ, మహిళలు, గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.

పాత పనులకే భూమిపూజ

ఇల్లంతకుంట: గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పాత పనులకే కొత్తగా కాంగ్రెస్ నాయకులు భూమిపూజలు చేస్తున్నారని జిల్లా జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. మండలకేంద్రంలో 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి బీఆర్ఎస్ హయాంలోనే భూమిపూజ జరిగిందని, ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సెస్ డైరెక్టర్ ఎం రవీందర్ రెడ్డి, వెంకటనరసింహారెడ్డి, సాదుల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదు



మాట్లాడుతున్న ఎస్‌కే గౌస్

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిపై ప్రొటోకాల్ అంటూ బీఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేయడం సరికాదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే గౌస్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ మండల నాయకులకు లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ప్రొటోకాల్‌పై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వారి అవినీతిపై త్వరలోనే అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుండగా అది గిట్టక అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు మల్లారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, ఇమాం, చంద్రయ్య, బాల్‌రాజు, రమేశ్‌గౌడ్, ఎల్లయ్య, మహేందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు



సిరిసిల్ల టౌన్ : కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను పట్టణంలోని తెలంగాణ భవన్‌లోని ఘనంగా నిర్వహించారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు జరిపారు. పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మాజీ ఎంపీ, బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను మండలకేంద్రంలో నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు కృష్ణహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : ఇల్లంతకుంట బీఆర్ఎస్ కార్యాలయంలో వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు



రుద్రంగి: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్ తీపిరెడ్డి మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మానాలలో అధికారులు, నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. రుద్రంగి ఎంపీడీవో నటరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి, నాయకులు జక్కు మోహన్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

రుద్రంగి: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూర సదానందం డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కొప్పు శ్రీధర్, బానోతు రాజు, తదితరులు పాల్గొన్నారు.

కళాకృతుల ప్రదర్శన



ఆవిష్కరించిన బ్రెయిన్ కళాకృతులు

సిరిసిల్లటౌన్: వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా చిన్నారులకు బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ కళాకృతులతో సందేశం ఇచ్చారు. సృజన్ హాస్పిటల్స్‌లో మంగళవారం బ్రెయిన్ డే పురస్కరించుకుని ప్రదర్శన ఏర్పాటు చేసి మాట్లాడారు. మెదడు చిత్రాలను ప్రదర్శించి, మెదడువాపు వ్యాధి లక్షణాలు, నివారణ తదితర అంశాలను వివరించారు. డ్రైఫ్రూట్స్‌తో వేసిన మెదడు, దేహం చిత్రాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ కందేపి ప్రసాద్‌రావు, సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

'టీబీ ముక్త్ భారత్ అభియాన్'



వేములవాడ: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. డాక్టర్ దివ్యశ్రీ ఆధ్వర్యంలో 72మందిని పరీక్షించి ఎనిమిది మంది నమూనాలు సేకరించారు. 26 మందికి ఎక్స్‌రే తీసినట్లు తెలిపారు. వైద్యురాలు లహరి, ఆరోగ్య పర్యవేక్షకుడు గంగమరాజు, శోభారాణి, సీనియర్ టీబీ సూపర్‌వైజర్ గంగాధర్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్లటౌన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణదారుల సమస్యలు పరిష్కరిచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు కోరారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగించేందుకు ప్రభుత్వం అన్నివసతులు కల్పించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఇసుక, కంకరకు అనుమతులు లేక, విక్రయదారులు విచ్చలవిడిగా ధరలు పెంచుతున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు, తదితరులున్నారు.

దిష్టిబొమ్మ దహనం

సిరిసిల్లటౌన్: ఒడిస్సా రాష్ట్రంలో విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడిన అగంతకుడిని ఉరితీయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని చేనేత విగ్రహం చౌరస్తా వద్ద నిందితుడి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు పూజ కార్తీక్ మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూజం కార్తీక్ టౌన్ జాన్ సెక్రటరీ ధనుష్ విజయ్ కుమార్, వినయ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

బోయినపల్లి: దేశాయ్‌పల్లి నుంచి, రామన్నపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బోయినపల్లి నుంచి విలాసాగర్, గర్శకుర్తికి వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైనా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లమరమ్మతులు చేపట్టాలని కోరారు.

సైకో హంగామా



సైకోను బంధించిన స్థానికులు

వేములవాడ: వేములవాడలో మంగళవారం సైకో హంగామా సృష్టించాడు. పట్టణంలోని ఆనందరెడ్డి ఆసుపత్రిలోకి చొరబడి రోగులు, ఆసుపత్రి సిబ్బంది, మెడికల్‌షాపులో దాడికి దిగాడు. ఆసుపత్రిలో ఉన్నవారు సైకోను పట్టుకుని తాళ్లతో కట్టేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి బయటికి పంపించారు. సైకో దాడిలో ఆసుపత్రి సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి.

సంక్షిప్త వార్తలు

• ఉపాధిహామీ సామాజిక తనిఖీ

ముస్తాబాద్: మండలకేంద్రంలో ఉపాధిహామీ పనులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ నాయకులు మీస సంజీవ్, మెంగని మహేందర్ ఆరోపించారు. ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ముస్తాబాద్‌లో ఒక్కో కూలీకి కనీసం ఇరవై రోజులు కూడా పనులు కల్పించలేదని బీజేపీ పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్ అన్నారు. నామ మాత్రంగా గ్రామ సభ నిర్వహిస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి రమే శ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• కోతులబారి నుంచి కాపాడాలి

వేములవాడ: పట్టణంలో మంగళవారం కోతులు ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. శివరామకృష్ణ థియేటర్ ప్రాంతంలో కర్ణపై, సుభాష్‌నగర్‌లో శ్రీనివాస్, భగవంతరావునగర్‌లో రమేశ్, తిప్పాపూర్‌లో రాములు, సాయినగర్ కృష్ణలపై దాడులు చేసి గాయపర్చాయి. వీరందరికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించాలి. కోతులబారి నుంచి రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

• మార్కండేయ ఆలయం నిర్మించాలి

సిరిసిల్ల అర్బన్ : పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గం పద్మశాలీలందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాద మైసయ్య అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి రాష్ట్ర పద్మశాలీ సంఘం, తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా తరఫున ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. పద్మశాలీ భక్త మార్కండేయ ఆలయాన్ని నిర్మించాలన్నారు. అంతకు ముందు గోనె ఎల్లప్ప మాట్లాడుతూ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయకుండా ఎన్నికల్లోకి పోవడం ఏమిటన్నారు. పద్మశాలీ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి రూ.50 వేల నామినేషన్ అనే విషయం ఎక్కడలేదన్నారు. రెండు సంఘాలు కాకుండా ఉండి మార్కండేయ ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయాలన్నారు. పద్మశాలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుంటుక మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

• మున్సిపల్ కమిషనర్‌కు వినతి

సిరిసిల్లటౌన్: మున్సిపల్ ద్వారా రూ.101కే దహన సంస్కారాలు పథకాన్ని తిరిగి ప్రారంభించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. గతంలో అమలుచేసిన ఆదర్శ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. కోశాధికారి దేవదాస్, సభ్యులు సారయ్య, రాజు తదితరులున్నారు.

• దార్శనికుడు 'దాశరథి'

సిరిసిల్లకల్చరల్: దార్శనికుడు మహాకవి దాశరథి అని పలువురు కవులు కొనియాడారు. దాశరథి జయంతి సందర్భంగా మంగళవారం గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా రచయితలు దాశరథి చిత్రపటానికి నివాళి అర్పించారు. సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, వెంగల లక్ష్మణ్, అంకారపు రవి, వంశీ, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడలోని మైనారిటీ గురుకుల కళాశాల, పాఠశాలలో దాశరథి కృష్ణమాచార్య జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు.

• నివాళి

సిరిసిల్లఅర్బన్: వీఎస్ అచ్చిదానందన్ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అమృత లాల్ శుక్లా భవన్‌లో కేరళ మాజీ ముఖ్యమంత్రి సీపీఎం వ్యవస్థాపక సభ్యులు కామ్రేడ్ వీఎస్ అచ్యుదానందన్ సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇక్కడ సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

• మద్దిమల్లలో చోరీ

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్లలో రెండిళ్లలో చోరీ జరిగింది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు.. సోమవారం రాత్రి మద్దిమల్లకు చెందిన చందనపు బ్రహ్మయ్య, చందనపు రాజేశం ఇళ్లలో రూ.30 వేల నగదు, బంగారం, 55 గ్రాముల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



చందుర్తి: మండలంలోని ఎన్గల్ గ్రామంలో మర్రిగడ్డ వైపు వెళ్లే పంచాయతీరాజ్ శాఖ రోడ్డును ఆనుకొని కంకర, ఇసుక కుప్పలు పోశారు. ఎస్సీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణం కోసం కంకర, ఇసుక కుప్పలు పోసి రెండునెలలు గడుస్తున్నా పనులు చేపట్టడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శి స్పందించి రోడ్డుపైకి వచ్చిన ఇసుక, కంకర కుప్పలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కోరె రాధిక
పంచాయతీ కార్యదర్శి, ఎన్గల్, సెల్ : 9550236351

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

ఇల్లంతకుంట: మహిళలు ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. ఇల్లంతకుంట మహిళా సమైక్య మహిళలు ధాన్యం అమ్మకాలపై రెండునెలల్లో రూ.కోటి కమీషన్ పొందారన్నారు. మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయిలో ఆత్మ నిర్భర్ సంఘటన్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.17 కోట్ల 50 లక్షలతో నిర్మించే 50 పడకల ఆసుపత్రి భవనానికి భూమిపూజ చేశారు. ఇల్లంతకుంట హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఇల్లంతకుంట– అనంతారం మధ్య బిక్కవాగుపై నిర్మించిన వంతెన అసంపూర్తి పనులకు రూ.44 లక్షలు మంజూరుకాగా ప్రారంభించారు. జవారిపేట – నర్సక్కపేట మధ్య రూ.40 లక్షలతో నిర్మించిన వంతెన పూర్తికాగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీవో శేషాద్రి, తహసీల్దార్ ఎంఏ ఫారూఖ్, శ్రీలత, ఎంపీడీవో శశికళ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, జీవనజ్యోతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఐలయ్య యాదవ్, పాశం రాజేందర్ రెడ్డి, పసుల వెంకటి, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి, ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఎప్పుడు ఇస్తారు?

సార్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎప్పుడు ఇస్తారని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను విన్నవించారు. మండలంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హాజరైన ఎమ్మెల్యేను లబ్ధిదారులు కలిశారు. పలువురికి రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్నారు. త్వరలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'



సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘంనాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ నాయకులు పర్కాల రవీందర్, దూమల రమానాథ్ రెడ్డి, అవురం సుధాకర్ రెడ్డి, జంగిటి రాజు, మైలారం తిరుపతి మాట్లాడారు. ఈనెల 23, 24న మండల తహసీల్దార్లతో సీఎంకు వినతిపత్రాలు ఇస్తామని, ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేసి, ఈ నెలాఖరులోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని కోరారు. సమావేశంలో భాగస్వామ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు

ఘనంగా బోనాలు



సిరిసిల్ల ఎడ్యుకేషన్: సిరిసిల్ల అర్బన్ చంద్రంపేట ఉన్నత పాఠశాలలో ఆషాఢమాస బోనాల వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల పోతరాజు వేషాలు, నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కంది సుజాత రెడ్డి, గ్రామపెద్దలు సూర దేవరాజు, పాతూరి రాజిరెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిరిసిల్ల: జాతీయ జెండా దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో మంగళవారం 300 మీటర్ల జాతీయ జెండాతో తిరంగా ర్యాలీని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించారు. దేశ గొప్ప వారసత్వం, విలువలను వివరిస్తూ.. జాతీయ జెండా ఆవశ్యకత, నినాదాలతో ప్రదర్శన నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పల్లె రాజిరెడ్డి తెలిపారు. ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ జెండా తిరంగా ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది.



తిరంగా ర్యాలీ..

• విద్యార్థులకు టై, బెల్టులు వితరణ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాదాపు రూ. 15వేల వ్యయంతో చైతన్య, అజయ్, హరికృష్ణ, నరేశ్, కరుణాకర్ రాజు, బాలాజీ, వేణులు కలిసి టై, బెల్టులు, గుర్తింపు కార్డులు అందించారు.